
సాగుకు కష్టకాలం!

- బాగేపల్లిలో అలీసాగర్ ఎత్తిపోతల ప్రధాన కాలువ నుంచి పైపులైన్ వేయాలని 12 ఏళ్లుగా కోరుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న సన్న, చిన్నకారు రైతులు


బాగేపల్లిలో చెరువు ఆయకట్టు కింద ఎండిన నారు

రెంజల్(బోధన్): మండలంలోని బాగేపల్లి గ్రామానికి చెందిన సన్న, చిన్నకారు రైతులు పంటలసాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతానికి సాగు నీరందించేందుకు 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అలీసాగర్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఎత్తిపోతల పథకం రెండవ పంప్‌హౌస్ బాగేపల్లి గ్రామంలో నిర్మించారు. అలీసాగర్ ఎత్తిపోతల ప్రధాన కాలువ నుంచి 600 మీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసి గ్రామంలోని చెరువుకు నీరందిస్తే ఆయకట్టు కింద పంటలు సాగవుతాయని రైతులు 12 ఏళ్లుగా పాలకులతో మొరపెట్టుకుంటున్నారు. సమస్యకు పరిష్కారం లభించడంలేదు.

ఎండుతున్న నారుమడులు..

చెరువు కింద సుమారు 200 ఎకరాలు వరకు ఆయకట్టు ఉండగా కొందరు రైతులు బోర్లు తవ్వుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. మరి కొందరు రైతులు పక్క వారి బోర్ల సహాయంతో సాగు చేసుకుంటుండగా సుమారు 30 ఎకరాలకు చెందిన సన్న, చిన్నకారు రైతులు మాత్రం చెరువు నీటి పై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. కాలం కరుణిస్తుందన్న నమ్మకంతో ఈ సీజన్‌లో నారుమడులు వేసుకున్నారు. వరుణుడి జాడ లేక పోవడంతో నారుమడులను కాపాడుకునేందుకు చుట్టూ పక్కల రైతుల బోర్ల నుంచి బకెట్లలో నీళ్లు తీసుకొచ్చి రెండు రోజులుగా చల్లుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

సమస్యను ఇటీవలే ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన ఆదేశాల మేరకు అధికారులు వచ్చి అంచనాలు తయారు చేశారు. 10 హెచ్‌పీ మోటారు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు రూ. 15 లక్షల వరకు ఖర్చవుతాయని అధికారులు పేర్కొన్నారు.

– సురేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్

రోడ్లపైనే పశువుల సంచారం

- రాకపోకలకు ఇబ్బందులు
- నందిపేటలో అవస్థలు పడుతున్న వాహనదారులు


నందిపేటలో రోడ్డు మధ్యన సంచరిస్తున్న పశువులు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రహదారులపై పశువుల సంచారంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పశువులను యజమానులు ఇష్టారీతిన రోడ్లపై వదిలి వేయడంతో ప్రయాణికులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండంలోని నంది చౌరాస్తా వద్ద, బస్టాండు సమీపంలో, చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద, రామ్‌నగర్ చౌరాస్తాల్లో రోడ్డుపైనే సేదతీరుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పశువుల యజమానులను హెచ్చరించినప్పటికీ కొన్ని రోజులు పశువులను నియంత్రణలో ఉంచుకుంటున్నారు. అనంతరం మళ్లీ యజమానులు తమ పశువులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా మారింది

పశువులు రోడ్లపై సంచరించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సుధాకర్, రామ్‌నగర్, నందిపేట

చర్యలు తీసుకుంటాం

నందిపేట పట్టణంలో రోడ్లపై పశువులను వదులుతున్న యజమానులపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే నోటీసులు జారీ చేస్తాం. రోడ్లపై మళ్లీ వదలకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఎంపీడీవో, నందిపేట

క్లుప్తంగా

అంకాపూర్‌లో వనమహోత్సవం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆదివారం గంగాదేవీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాదేవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కే వినోద్ రెడ్డి తన సొంత ఖర్చులతో 30 మొక్కలను నాటి రక్షణ కంచెలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శంకర్, కే నారాయణ రెడ్డి, పెర్కిట్ చిన్న గంగా రెడ్డి, ఎస్ రాజా రెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో స్వచ్ఛభారత్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మసీద్ సమీపంలోని కాలనీలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సుంకే శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కాలనీలో మురికికాలువలను శుభ్రం చేశారు. అలాగే పిచ్చి మొక్కలను తొలగించారు.సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కారణం లేకుండానే దుకాణాన్ని కూల్చివేశారు

బోధన్ టౌన్: పట్టణంలోని ఉర్దూఘర్ ఆవరణలోని తన దుకాణాన్ని అధికారులు కారణం లేకుండానే కూల్చి వేశారని యజమాని రౌవుఫ్ వాపోయారు. ఆదివారం పట్టణంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఖదీర్, జునైద్ లతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బల్దియా నిబంధనలకు లోబడి దుకాణాన్ని నిర్వహిస్తున్నానని, ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నానని తెలిపారు. కొన్ని రోజులుగా మున్సిపల్ అధికారులు దుకాణం గ్రీన్ బెల్ట్‌లో ఉందని కూల్చివేస్తామన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నా దుకాణాన్ని కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరారు.

ప్రత్యేక రైలు ఆర్మూర్ స్టేషన్‌లో ఆగేలా చూడాలి

ఆర్మూర్‌టౌన్: నాందేడ్ నుంచి తిరుపతి వెళ్లే ప్రత్యేక (స్పెషల్) రైలును ఆర్మూర్ స్టేషన్ లో ఆగేలా చూడాలని, అలాగే శాశ్వతంగా నడిచేలా చేయాలని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోలా వెంకటేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆగస్టులో ప్రారంభం కానున్న ప్రత్యేక రైలు ప్రతి శనివారం నాందేడ్ నుంచి బయలుదేరి నిజామాబాద్, జగిత్యాల్, వరంగల్ మీదుగా తిరుపతికి వెళ్తుంది. పార్లమెంట్ సమావేశాల్లో కాని, రైల్వే మంత్రిని ఎంపీలు సురేష్ రెడ్డి , ధర్మపురి అర్వింద్‌లు కలిసి ఆర్మూర్‌లో ఆగేలా చూడాలని కోరారు. దీంతో ఆర్మూర్, బాల్కొండ, నిర్మల్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల ప్రజలు తిరుపతి వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కాలనీలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ కాలనీవాసులకు నీటి సరఫరా కోసం ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో వాటర్‌ట్యాంక్‌ను నాలుగు పిల్లర్లతో నిర్మించారు. ప్రస్తుతం వాటర్‌ట్యాంక్ పిల్లర్లు శిథిలావస్థకు చేరాయి. ప్రమాదం సంభవించక ముందే నీటి ట్యాంకును తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

లక్ష్యంతో ముందుకెళ్లి ఉద్యోగం సాధించాలి



మాక్లూర్: ఎంబీఏ పూర్తి చేసుకుని వెళ్తున్న విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగి ఉద్యోగం సాధించాలని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని దాస్‌నగర్ వద్దగల వీఆర్‌ఈసీలో జరిగిన ఎంబీఏ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంకిత భావంతో ముందుకు సాగిన ప్రతి విద్యార్థికి విజయం చేకూరుతుందన్నారు. అనంతరం వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు ఆటపాటలతో గడిపారు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌కుమార్, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

23న పాఠశాలల బంద్ విజయవంతం చేయాలి


బోధన్‌లో మాట్లాడుతున్న నాయకులు

బోధన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23న తలపెట్టిన పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు గౌతం కుమార్, నాగరాజు పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో విద్యార్థి సంఘాల జిల్లా, డివిజన్ ప్రతినిధులు సమావేశమై మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మోసిన్,ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధి అల్తమస్, నాయకులు సాయినాథ్, రాజన్న, శ్రీకాంత్, గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నాయకులు జూలై 23న జరుగనున్న విద్యాసంస్థల బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు.పెండింగ్‌లో ఉన్న రూ.8000 కోట్ల స్కాలర్‌షిప్,ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులను తక్షణం విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ,ఏఎస్ఎఫ్ఐ,పీడీఎస్‌యూ,ఏఐపీఎస్‌యూ,ఏఐఎఫ్‌టీఎస్, ఏఐఎస్‌బీ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు గోపాల్‌సింగ్, రాజ కొండ విఘ్నేష్, సిద్ధార్థ, కల్యాణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సాహితి కిరీటి సాయిలుకు డీఈవో అభినందన


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో అశోక్‌కుమార్

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పని చేస్తున్న (సాహితి కిరీటి) టేకుర్ల సాయిలును డీఈవో అశోక్ కుమార్ అభినందించారు. సాయిలు రాసిన రచనలు, అంతరంగ మదన శతకం, శ్రీరామ శతకం, ఆత్మ పరిశోధన శతకం, గజల్స్, 300పైగా కవితలు కలిపి తయారు చేసిన పుస్తకాన్ని డీఈవో ఆవిష్కరించారు. డొంకేశ్వర్ జెడ్పీ స్కూల్‌లో తెలుగులో 8మందికి నూటికి నూరు మార్కులు రావడం గొప్ప విషయమన్నారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రవీణ్ ఉన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న భూమేశ్ రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆపదలో మెరుగైన వైద్యం చేయించుకోలేని బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిసెరం భూమేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం దత్తాపూర్ గ్రామంలో పలువురికి చెక్కులు పంపిణీ చేశారు. జంగాల అనితకు రూ.25వేలు, లక్ష్మీనారాయణకు రూ.60వేలు, మంతెన పద్మకు రూ.40వేలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చిన్న భూమన్న, నాగరాజు, సుంకరి రాజు, స్రవంతి, వంశీ ఉన్నారు.

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బామని సాయన్న రూ.30 వేలు, అన్నగౌడ్ సుశీల రూ. 54 వేలు, బ్యాగారి పుష్ప రూ. 27 వేలు, తోట పద్మ కు రూ. 14 వేలు మంజూరు కావడంతో నాయకులు అందించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎడ్డిగారి నిఖిల్,యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు పిరాజీ నాగరాజ్, పీసీఎస్ డైరెక్టర్ తోట మహేష్, మాజీ సర్పంచ్ ధర్మన్న, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తబ్రేస్, తుక్కన్న, ఎల్లమ్మ గుట్ట చైర్మన్ బొమ్మ సందీప్, సీనియర్ నాయకులు గోజురు పోశెట్టి,జావీద్, రసూల్ పాల్గొన్నారు.


కుద్వాన్‌పూర్‌లో పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా బోనాల పండుగ

వేల్పూర్/పెర్కిట్/బోధన్ టౌన్/రుద్రూర్/వర్ని/నందిపేట్/మాక్లూర్/బోధన్/ నవీపేట : ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బోనాలు ఎత్తుకొని గ్రామ దేవతల వద్దకు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించి బోనాలు సమర్పించారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని, అందరు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. అలాగే గ్రామాలలో వనభోజనాల సందడి కనిపించింది.


పెర్కిట్ మహాలక్ష్మి కాలనీలో బోనాలతో మహిళలు


బోనాల ఊరేగింపులో విన్యాసాలు చేస్తున్న పోతరాజు


వేల్పూర్‌లో అమ్మవారి పల్లకీ సేవలో గీతకార్మికులు


రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో ..


బోధన్ శక్కర్ నగర్‌కాలనీలో..


ఐలాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు


ఏఆర్‌పీ క్యాంప్‌లో ..

రోడ్డును తవ్వి వదిలేశారు


పట్టణంలోని శక్కర్‌నగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

బోధన్‌టౌన్ : పట్టణంలోని శక్కర్ నగర్‌లోని ఓగల్లీలో వాటర్ పైపులైన్ కోసం బల్దియా సిబ్బంది రోడ్డును తవ్వి వదిలేశారు. నెలలు గడుస్తున్నా రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రయాణానికి ఆటంకంగా ముళ్లపొదలు

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్ నుంచి సాహెబ్‌పేట్ వెళ్లే దారిలో రెండో ఒర్రె వద్ద ముళ్లపొదలు ఏపుగా పెరిగి ప్రయాణానికి ఆటంకంగా మారాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈరహదారి వెంట వేల్పూర్‌కు మండల కేంద్రానికి నిత్యం చాలా మంది ప్రయాణిస్తారు. ముళ్లపొదలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆర్‌అండ్‌బి అధికారులు చర్యలు తీసుకొని ముళ్లపొదలు తొలగింపజేయాలని కోరుతున్నారు.


రోడ్డును ఆక్రమిస్తున్న ముళ్లపొదలు

నల్ల పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



పూజలందుకున్న నల్లపోచమ్మ, పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల బారులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో గ్రామదేవతలైన నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ, పెద్దమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వసమాజ సభ్యులు ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రత పరంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.


నల్లపోచమ్మ ఆలయం వద్ద ..